స్కెచ్

# మా అత్తయ్యా బేరం

"గోపి"

"బెండ...కా..య..లూ..వే" అని వీధిలో రాగయుక్తంగా లచ్చి అరుపు.

"ఒరే నానీ! పిలురా, బెండకాయలు కామోసు!" అని లోపలనుంచి అత్తగొంతుక.

"ఒసే! బెండకాయలూ ఇలా రావే!" అని నాని పిలుపు.

* * *

"ఒక్కసోటే నిలబడిపోతే సరా తల్లీ... బెండకాయలు...వే!..."

"ఉండవే రైలెక్కొచ్చినట్లు ఒకటేగోల, చెయ్యి తీరుబాటు చేసుకో వచ్చేంతలో, కచ్చలో కందులు వేసేస్తావ్!"

అరుగుమీదనుంచే "బెండకాయలూ...వే" అని లచ్చి మరో ప్రసారం.

"అబ్బబ్బ! కంచుగంటలా అరుస్తుంది" అని అత్త సణుగు.

"పొద్దల్లా ఒక్కాడే కూకుంటే పొట్టెల్లా జరుగుతా తల్లీ ... బెండకాయలూ...వే!" అని మళ్ళా కేక.

"ఇలా రావే బెండకాయలూ" అని ఇరుగు పొరుగు వాళ్ళ పిలుపులు.

దక్షిణాది మడిపంచె కొంగుకు మజ్జిగ చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది అత్త అరుగుమీదికి.

"ఏదీ! ఇలా పెట్టి కొంచెం దూరంగా నిలబడూ, మడిపంచతో ఉన్నాను...ఏం బెండకాయలే మా తాత వయస్సుంది వీటికి... ఒక్కటీ కూడా చివర చిటుక్కున విరగదు కదా!"

"నా విరుస్తాను సూడమ్మా..."తట్ట లాగింది.

"నీయమ్మకడుపు చల్లనవా! ముట్టేసుకున్నావుటే! అబ్బబ్బ! మడీ ఎడమా లేదు. ఇంట్లో వేధవలూ అంతే...పైవె...(నాలిక కరుచుకొని) మడీ అంటే క్షణం వేగలేం...దయ్యంగోళ్ళతో తుంపి అక్కడ పెట్టకు, అవి నా కక్కరలేదు... అసలు బేరంచెప్పావు కావు." అడిగింది అత్త.

"ఒక్కమాట సెప్పనాతల్లీ?"

"పదిచెప్పు! ఎందుకే! సిసలుధర చెప్పేయ్."

"ఆరణాలు."

"అబ్బోయ్! నాలుగణాలకి నవనవలాడుతూన్న సజ్జకాయలు నిన్న తెచ్చారు మా ఆయన. బజారునుంచి. ఆరణాలట...ఆరణాలు.." సాగదీసింది అత్త.

"నానే ఇచ్చానమ్మా నిన్న సాయంతరం బాబుగారికి"...అంది తడుముకోకుండా లచ్చి.

"మిగిలిన పుచ్చులూ ముదర్లూ షికారు తెచ్చావు కామోసు" అంది హాస్యాన్ని అంతర్వాహిన్లో నడిపిస్తూ.

"బెండకాయలూవే!"అని మరో ప్రసారం.

"బెండకాయలూ-బెండకాయలూ!"వీధివాళ్ళ పిలుపు.

"వస్తుండా వస్తుండా బెండా..."

"ఏం చెప్పావ్ మరి?" అడిగింది అత్త.

"తీసుకోమ్మా. ఒక్కాడే ఇంత సేపైంది."

"ఇన్ని తుంపినా పాతిక కాయలు తేలందే!"

"అదేందమ్మా,అలాగంటావు? నేతకాయలొగ్గిసి పెద్దవన్నీ ఇరగ్గొట్టిపోగేస్తున్నావు"గుణిసింది లచ్చి.

"బొత్తిగా దొండకాయల్లాటి వేం చేసేదే నేను!"

"సిన్నైతే సిన్న; పెద్దైతే ముదర; సాల్లేయమ్మా బేరం దమిట్టోళ్ళి బేరానికి గంటున్నర తగువు..."అని కసురుకుంది లచ్చి.

"నిన్నే అమ్మమని నే సలహా యిచ్చానా?" అడిగింది అత్త.

"బెండకాయలు...వే!"అని మళ్ళా అరుపు.

"బెండకాయలూ బెండకాయలూ"అని వీధి వాళ్ళ పిలుపు...ఇది పల్లవి.

"ఇదిగో! ఇవి పాతికమీద రెండుచేతులు. అణా యిస్తాను. బొత్తిగా చిన్నవి ఇస్తేయియ్యి, లేకపోతే ఫో!"అంది అత్త ఫైనల్గా.

"ఒక్గేయ్ తల్లీ, నీ దరమ్మొంటుంది. నీవడిగిన ధరకిచ్చినా గీసులాటా?" అని బెండకాయలు తట్టలో వేసుకుంది లచ్చి విసురుగా.

"ఉండుండు, మరో కానీ ఇస్తాను, సరా!... అన్నీ మళ్ళా కలగాపులగం చేశావు...అబ్బబ్బ! నీతో బేరం-ఎప్పుడూ ఇంతే! ముజ్జిడ్డు. అబ్బే ఆ ముదరపణుకులు నే నేరినవి కావు..."

"ఒరే నానీ! వెధవెక్కడకో జఫాయించేశా డప్పుడే. అమ్మలూ!"

"ఏం పిలిచావమ్మా!" కీచు గొంతుకతో పెక్కింది.

"ఇదిగో వంటింట్లో, గదుల పెట్టెలో, ఇంగువ డబ్బాలో బేడకాసుంటుంది ఇలా తీసుకురా. మధ్యదార్లో మడివస్తువులు జాగ్రత్త!" అని బేడ కాసుకి అక్షాంశం తులాంశం చెప్పింది అత్త.

"లేదే" అని అమ్మలు అరిచింది కీచుగా వంటింట్లోంచి.

"అయ్యో! నా మతిమరుపు మండా! నిన్న గిన్నెలవాడికిచ్చేశాలు ... (విసుబుగా) లచ్చీ! అలా తిరిగిరావే, రూపాయి మార్పించి యిస్తాను" అంది.

"ఇల్లా ఇయ్యమ్మా సిల్లరిస్తాను." అడిగింది లచ్చి మరోసారి బెండకాయ ప్రసారం సాగించి.

"సరి రూపాయి ఉంటే చిల్లరెవరన్నా ఇస్తారు. లేకనే! మా సీతమ్మతల్లి ఇప్పడిస్తానని తీసుకెళ్ళింది బిళ్ళకుడుములా రూపాయి. ఐపూ పత్తాలేదు ఇప్పటికీని..."అమ్మలూ,సీతమ్మ పిన్ని నడిగి రూపాయి తీసుకురావే" అని అజ్ఞ జారీ చేసింది రాని రూపాయిగురించి.

"బోణీబేరం, బేగి పంపుతల్లీ నీ పుణ్యముం టుంది" అని గొణిగింది లచ్చి.

"ఇదిగో! ఈ కానీ తీసుకెళ్ళు. బోణీకి నా చేతి బోణీ, పడిందంటే, గంప గడియలో చెల్లి పోతుంది. తిరిగి వచ్చేప్పుడు నీ అణా పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను" అని సాంతం చేసిందత్త, ఆ రోజుకి బేరం విజయవంతంగా!

"రామం! రామం!"

"ఏమత్తా?" అడిగా నేను.

"మీ మావ ఇన్నిసార్లు బెండకాయలు తెచ్చారు ఎప్పుడన్నా ఇలాగున్నాయీ? పుచ్చులు, ముదర్లూ కాని."

"అత్తా! కాయలు భేషుగ్గా ఉన్నాయి. కానీ నేను పదికి కాలేజీకి వెళ్ళాలి. మావ పదిన్నరకి ఆఫీసు కెళ్ళాలి."

"అవునవును. అది ముట్టుకుంది కూడాను అమ్మలూ! ఆ పెడలపొయ్యి రాజెయ్యి స్నానం చేసి క్షణంలో వండేస్తాను." అని స్నానానికి నిష్క్రమించిందత్త.

"ఏంరా, రామం కాలేజికి టైంకాలే!" పలక రించాడు మావ. బలే ఖుషిగా ఉన్నాడివ్వా ళెందుకో!

"ఐంది మావా, ఆకల్లేదు. ఒంటిగంటకి తిందామని ననిగిసాను" అన్నా—మావ సురాకారం పాలు తెలిసి.

"చూడ్రా రామం! ఎండలు మండిపోతూంటే ఎంత ఏపుగా పెరిగాయో బెండకాయలు అనకాపల్లివిట" అని పైమీద సిలుకు కండువా విప్పి చూపించాడు మావ.

"ఎల్లాగిచ్చారు మావా?" అని అడిగా తడారిన గొంతుకతో!

"అబ్బే! వంద బేడ. కాయ చవకగా ఉన్నా యివ్వాళ"-పొడి గుట్టకలు మింగుతూ, రాబోయే సీన్లని చూస్తూ, "టైమైంది మావా కాలేజీకి పోతా" నని నిష్క్రమించాను జరగబోయే యుద్ధరంగంనుండి.

పుస్తకాలు సర్దుకొని, కాలేజీకిపోతుంటే వీధి చివర "బెండాకాయలూ...వే!" అని లచ్చి రాగం "ఇలారా బెండకాయలూ" అనే పల్లవి, నా చెవుల్లో పడుతూనే ఉన్నాయి.